క్లుప్తంగా

బాధిత కుటుంబానికి కార్పొరేటర్ పూర్ణిమ పరామర్శ



ఆంథోనీరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్ తదితరులు

కంచరపాలెం: ఇటీవల విధుల్లో భాగంగా జమ్మూ–కాశ్మీర్‌లో ప్రమాదవశాత్తు మరణించిన ఆంథోనీరాజు కుటుంబాన్ని మంగళవారం జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ పరామర్శించారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ధ్రువీకరణ పత్రాలపై సీఐఎస్ఎఫ్ ఎస్ఐ కుటుంబ సభ్యుల సమక్షంలో సంతకాలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ దేశ సేవలో కుటుంబాన్ని విడిచి అహర్నిశలు పని చేయడం గొప్ప విషయమన్నారు ఆంథోనీరాజు మరణవార్త తమని కలచివేసిందన్నారు. రాజు ఆత్మకు కలగాలన్నారు. కుటుంబ సభ్యులకు అశ్రునయనాలతో ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వేళాంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాని మధు, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, డి.శ్రీను, కిషోర్, మధు, శేఖర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా సహకార అధికారికి కార్యవర్గ జాబితా అందజేస్తున్న వెంకటరావు తదితరులు

మహారాణిపేట: జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా దాసరి వెంకటరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రమణ, కోశాధికారిగా కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎ.వి. శ్రీను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మంగళవారం జిల్లా సహకార శాఖ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి కార్యవర్గ సభ్యులను పరిచయం చేసింది.

అప్పన్న చందన సమర్పణకు రూ.లక్ష విరాళం



ఏఈఓకు నగదు అందిస్తున్న దాత ఆళ్ల వెంకట రామకృష్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందన సమర్పణకు విశాఖలోని ఎండాడకి చెందిన ఆళ్ల వెంకట రామకృష్ణ, రంగమణి దంపతులు రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకు ఇచ్చారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

పాపాహోంకు ఫోర్త్ టౌన్ పోలీసుల వితరణ



పాపాహోంకు బియ్యం బస్తాలు అందజేస్తున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

తాటిచెట్లపాలెం: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం పాపా హోమ్‌లోని పిల్లలకు బియ్యం బస్తాలు అందజేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా పాపా హోమ్ నిర్వాహకులకు బియ్యం బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్టేషన్ సిబ్బంది తమ సొంత డబ్బుతో నిర్వహించినట్లు సత్యనారాయణ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం దరి దాలిరాజు సూపర్‌మార్కెట్ సమీపంలో గల వివేకానంద ఆస్పత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజన్ ట్రీ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు క్యాటరాక్ట్, గ్లకోమా, రెటీనా వంటి పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి విజన్ ట్రీ ఆస్పత్రిలో ఆపరేషన్లు చేయనున్నట్టు చెప్పారు.

అప్రమత్తతే.. శ్రీరామరక్ష

వాతావరణ మార్పులతో విజృంభిస్తున్న జ్వరాలు

ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు

ముందు జాగ్రత్తలే మేలంటున్న వైద్యులు



ఓపీ నమోదుకు క్యూ కట్టిన జ్వరపీడితులు



కేజీహెచ్‌లో జ్వరపీడితులు

డాబాగార్డెన్స్: వాతావరణ మార్పుల వల్ల సంభవించే సాధారణ వ్యాధులతో పాటు కలుషిత నీరు, అపారిశుధ్యం వల్ల మరిన్ని వ్యాధులు దాడి చేస్తాయి. ఈసారి కూడా ఇందుకు మినహాయింపు లేదన్నట్లు నగరంలో అప్పుడే పలు రకాల వ్యాధులు ప్రబలుతున్నాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవి అందరిపై దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిని తరిమికొట్టే చర్యల్లో నిమగ్నం కావాలి.

వైద్య శిబిరాలు ఎక్కడ?

జ్వరాలు విజృంభిస్తున్న మురికివాడ ప్రాంతాల్లో ఎక్కడా వైద్య శిబిరాలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలు తప్ప.. ప్రభుత్వ పరంగా ఎక్కడా వైద్య శిబిరాల ద్వారా ఉపశమనం లభించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వామి వివేకానంద సంస్థలో..

ప్రతి నెలా రెండో గురువారం పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో స్నేహ సంధ్య ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థలోని వృద్ధులు, స్థానిక పేదలకు ఉచితంగా బీపీ, షుగర్ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నారు. మందులు కూడా ఉచితంగానే ఇస్తున్నారు. డాక్టర్ సూర్య తేజ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నడుస్తోంది.



స్వామి వివేకానంద సంస్థలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యతేజ (ఫైల్)

జాగ్రత్తలతోనే నివారణ..

వానాకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే కాలమిది. అపరిశుభ్ర వాతావరణం, దోమల వల్ల వ్యాపించే విషజ్వరాలు, నీటి కాలుష్యం వల్ల సంభవించే డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

మురికివాడల్లో జ్వరాల విజృంభణ..

నియోజకవర్గ పరిధి కొబ్బరితోట, జ్ఞానాపురం, అల్లిపురం, జబ్బర్‌తోట, రెల్లివీధి, పాతనగరం కోటవీధి, ఫెర్రీరోడ్డు, థామ్సన్ స్ట్రీట్, చిలకపేట, పద్మానగర్, కర్రలదొడ్డి, వెలంపేట, కంచరవీధి, చెంగల్రావుపేట, కదిరి దానప్పవీధి, కోడిపండ్యాల వీధి, తాడివీధి, సాలిపేట, రామజోగిపేట, భుజంగరావుపేట, ఆంథోనీనగర్, గొల్లలపాలెం, వేంకటేశ్వరమెట్ట తదితర ప్రాంతాల్లో జ్వరపీడితులు అధికంగా ఉన్నారు. ఇప్పటికే మంచాన పడిన వారు కొందరైతే.. ఆస్పత్రులకు క్యూ కడుతున్న వారు మరి కొందరు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త..



వర్షాకాలంలో సీజనల్‌గా వ్యాపించే మలేరియా, డయేరియా, డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తత అవసరం. డయేరియా సోకిన రోగికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. లేదంటే వారు కూడా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. డయేరియా సోకిన వ్యక్తికి కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగించాలి. లీటర్ నీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్ కలిపి 3 నుంచి 4 గంటల వ్యవధిలో తాగించాలి. మంచి నీళ్లు కాచి చల్లార్చి తాగాలి. నిల్వ ఆహార పదార్థాలు తినకూడదు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

– ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ, జనరల్ మెడిసిన్

వాతావరణ మార్పులే కారణం..



వాతావరణం ఒక్కసారిగా వేడిగాను చల్లగాను అవడం చాలా ప్రమాదం. ఎండలు విపరీతంగా ఉన్నాయి. వర్షాలు వడలేదు. నిన్నటికి నిన్న 8 కేసులు వచ్చాయి. నా వద్దకు వచ్చే పేషెంట్లు ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. వాతావరణంలో మార్పు రావడమే అందుకు కారణం. నగరంలో అపారిశుధ్యం తాండవిస్తోంది. ఓ వైపు దోమలు.. మరోవైపు వాతావరణంలో మార్పుల ఫలితంగా అనేక అరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమయంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలి. బయటి చిరుతిళ్లు తినరాదు. ముఖ్యంగా ఫ్రిడ్జిల్లో పెట్టినవి తినకూడదు.

– రియాజ్ అహ్మద్, హోమియో వైద్యుడు

అంగన్‌వాడీ విద్యార్థులకు కిట్ల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు కిట్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శామ్యూల్ నేతృత్వంలో చిన్నారులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా నగర అంగన్‌వాడీ అధ్యక్షురాలు, వార్డు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి సాయిలత, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు పెద్దాడ జ్యోత్స్న పాల్గొని చిన్నారులకు కిట్లు అందజేశారు. వార్డులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యాక్టివ్ కార్యదర్శి పల్లా ఎర్నికుమార్ యాదవ్, వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీను, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా కుమారి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రావణలక్ష్మి పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ పూజల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి అష్టదళ పద్మారాధన..

సిరులతల్లికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అంటేనే మోసం.. దగా

- 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' సభలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- గాలికి కొట్టుకుపోయిన 'సూపర్ సిక్స్' : మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి, జాన్‌వెస్లీ



'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేకే రాజు, వాసుపల్లి, జాన్‌వెస్లీ తదితరులు

తాటిచెట్లపాలెం: చంద్రబాబు అంటే గుర్తుకొచ్చేది మోసం, దగా అని, వీటితోనే ఆనాడు సొంత మామనే మోసం చేసి తెలుగుదేశం పార్టీని లాక్కున్నారని, నేడు మళ్లీ రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు విమర్శించారు. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని జీవీఎంసీ 42వ వార్డులో, వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో సుబ్బలక్ష్మీనగర్‌లోని సుబ్బలక్ష్మీ కళ్యాణ మండపంలో మంగళవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేకే రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు 'సూపర్ సిక్స్' అని ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, నేడు వాటిని అమలు చేయలేమని సొంత పార్టీ నేతలే వీటిని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని అంటున్నారన్నారు. ఎన్నికల ముందు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలు ఆశపడటంలో తప్పులేదని, ఆనాడు జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న పథకాల కంటే ఎక్కువ ఇస్తానని మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని తెలిపారు. ఎన్నికల ముందు ప్రశ్నిస్తానన్న మరో నాయకుడు కనీసం పత్తాలేకుండా పోయారని విమర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు చంద్రబాబు నాయుడు ప్రజలను ఎలా మోసం చేశారో తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 18–59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తానన్నాడని, ఇచ్చాడా? ఇవ్వలేదు, సరికదా ఇప్పుడు ఆ పార్టీ నాయకుడు అచ్చెన్నాయుడు ఏమన్నారో విన్నారు కదా? అలా ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలంటున్నాడు. నిరుద్యోగభృతి అన్నాడు, ఇచ్చాడా? రూ. 3 వేలు, సంవత్సరానికి రూ. 36 వేలు, ఇలా ఎన్నో హామీలు గాలికొదిలేశారు. చంద్రబాబు ఇలా ఒక్కో కుటుంబానికి సుమారు సంవత్సరానికి లక్ష రూపాయలు ఎగనామం పెట్టేశారని, అలా చూస్తే సుమారు రూ. 30 వేల కోట్లు సంవత్సరానికి ఇవ్వాలని, ఇప్పటికే ఒక సంవత్సరం ఎగ్గొట్టేశారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డు సమస్యలను తమ సమస్యలుగా తీసుకుని, ప్రజలందరినీ, ముఖ్యంగా కార్యకర్తలందర్నీ కంటికి రెప్పలా కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, నియోజకవర్గ నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, బూత్ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.1.46 కోట్లతో ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: రోడ్ల దుస్థితిపై జోన్–4 పరిధి సౌత్ జైలురోడ్డులో వాహన చోదకుల అవస్థలపై సోమవారం వెలువడిన 'అడుగుకో గొయ్యి.. చూసి అడుగెయ్' కథనానికి జీవీఎంసీ జోన్–4 సహాయ ఇంజినీర్ స్పందించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్ వరకు రోడ్డు నిర్మాణానికి పరిపాలనాపరమైన ఆమోదం కోసం రూ.1.46 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆమోదం వచ్చిన తర్వాత రోడ్డు పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రజలకు చేరువగా న్యాయ సేవలు



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: ప్రజలకు న్యాయ అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో విశాఖ ఉమ్మడి జిల్లాల జాగృతి యూనిట్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడమే జాగృతి పథకం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అందించే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్15100 ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.శ్యామల, డిప్యూటీ సీఈవో రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో పారదర్శక సేవలకు వినతి



డాక్టర్ రాధారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్టు 2010ని జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఆరోగ్య సేవలపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్ కోరింది. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణికి కౌన్సిల్‌కు చెందిన కె.రాము వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రులు ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 రూపొందించారని రాము మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత కార్యాలయం ముందు పోస్టర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ విద్యావిధానంపై వెబినార్



వెబినార్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ధర్మారావు

ఎంవీపీ కాలనీ: జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించారు. ఇగ్నో విశాఖ ప్రాంతీయ కార్యాలయంలో సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆన్‌లైన్‌లో పాల్గొని జాతీయ నూతన విద్యావిధానం అమలు, అందుబాటులో ఉన్న కోర్సులు, విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి జరుగుతున్న ప్రోత్సాహం వంటి అంశాలను వివరించారు. ఎన్ఈపీ – 2020 విద్యార్థుల భవిష్యత్‌కు ఎలా దోహదం చేస్తుందో తెలియజెప్పారు. ఈ వెబినార్‌లో అస్సాం విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ పి.కనకారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నట్లు ధర్మారావు వెల్లడించారు. పలువురు విశాఖ ప్రాంతీయ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం నాగపంచమి పూజలను విశేషంగా నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌కు పెద్ద ఎత్తున క్షీరాభిషేకాలు జరిపారు. విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ పూజలను నిర్వహించారు.

యోగసిద్ధాంజనేయుడికి శ్రావణ మాస పూజలు



మురళీనగర్: జాతీయ రహదారి సూర్యనగర్‌లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామికి శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంత్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు, సింధూర అర్చన, తమలపాకుల పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం దీపధూప నైవేద్యాలు సమర్పించారు. యోగసిద్ధాంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహిక సుందరా కాండ పారాయణం చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు సుబ్బరాజు, యశోద దంపతులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవను ఆలయ బేడామండపంలో ఉదయం ఘనంగా నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపి, విశేష హారతులిచ్చారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

విద్యార్థుల వికాసానికి చిరునామా



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

కంచరపాలెం: నూతన విద్యా విధానం అమలు చేసి 5 వసంతాలు పూర్తయిన సందర్భంగా కేంద్రీయ విద్యాలయాలను పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలుగా నామకరణం చేసి జాతికి పునరంకితం చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు గాను తెలుగు రాష్ట్రాల నుండి కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో గల కేంద్రీ విద్యాలయం–1 విజయనగర్‌ను ఎంపిక చేశారు. దీని పేరును కూడా మార్చారు. దీంతో ఇదిప్పుడు పీఎం శ్రీకేంద్రీయ విద్యాలయం–1గా మారింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.గణబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యాలయాన్ని జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వికాసానికి కేంద్రీయ విద్యాలయాలు చిరునామా అని అభివర్ణించారు. ఈ సందర్భంగా అండర్–14 హ్యాండ్ బాల్ విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేవీ–1 ప్రిన్సిపాల్ జి.కిషోర్, హెడ్ మాస్టర్ ఎం.మాలిక్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూలో చిత్రలేఖన పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులులపై చిత్రలేఖనం పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు నగరంలోని పలు పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూ అధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో పులులు కీలక జాతులని తెలిపారు. విశాఖ జూలో రాయల్ బెంగాల్ టైగర్స్, తెల్ల పులులు సందర్శకులను అలరిస్తున్నాయని తెలిపారు. పులులుపై అవగాహన కల్పించడానికి జూలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు.